సాక్షి రంగారెడ్డి

గురువారం । 23 । జనవరి । 2025



నిరసనలు.. నిలదీతలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలు గందరగోళం నడుమ కొనసాగుతున్నాయి. 8లో▶



ఈత వనానికి నిప్పు

గుర్తు తెలియని దుండగులు ఈత వనానికి నిప్పంటించిన ఘటన శ్రీరాంనగర్‌లో చోటు చేసుకుంది. 8లో▶



విద్యార్థుల సంక్షేమానికి కృషి

పేద విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఐ నడక్ సంస్థ సీఈఓ రోమన్ చేసా అన్నారు. 8లో▶

న్యూస్‌రీల్

నేడు చేగూరుకు సీఎస్ శాంతికుమారి

కొత్తూరు: నందిగామ మండలం చేగూరులో గురువారం నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామసభకు సీఎస్ శాంతికుమారి హాజరు కానున్నట్లు తహసీల్దార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ పథకాల అర్హుల జాబితా, ఎంపిక ప్రక్రియను ఆమె పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

25న విద్యుత్ వినియోగదారుల సదస్సు

మహేశ్వరం: కందుకూరు డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈనెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఆశాఖ డీఈ గోపాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్, పహాడీషరీఫ్, అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు సంబంధించిన వినియోగదారుల సమస్యలు, సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి వంటివి పరిష్కరిస్తారని సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సంచార పశువైద్య అంబులెన్స్ తనిఖీ



కందుకూరులో సంచార పశువైద్య అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న బషీర్

కందుకూరు: మండల కేంద్రంలో 1962 సంచార పశువైద్య అంబులెన్స్ వాహనాన్ని ఆ ప్రాజెక్టు హెడ్ డాక్టర్ బషీర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ ద్వారా పశువులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, జిల్లా అధికారి రాజబాబు, డాక్టర్ పృథ్వీరాజ్‌రెడ్డి, టెక్నీషియన్ సాయికృష్ణ, వెంకటేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ రైతులతో అధికారుల సమావేశం



గుమ్మడవెల్లిలో రైతులతో సమావేశమైన అధికారులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని గుమ్మడవెల్లి, ఆకులమైలారం రైతులతో బుధవారం భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు సమావేశమై చర్చించారు. గుమ్మడవెల్లి 2.10 ఎకరాలకు సంబంధించి నలుగురు రైతులు, ఆకులమైలారంలో మూడున్నర గుంటల భూమికి సంబంధించి మరో రైతుతో మాట్లాడారు. బహిరంగ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ యాదగిరి తదితరులు ఉన్నారు.

అనైతిక వైద్యం!

అల్లోపతి డాక్టర్లుగా చలామణి అవుతున్న ఆయుర్వేద వైద్యులు



- అనుతులు లేకుండా అడ్డగోలుగా క్లినిక్‌ల ఏర్పాటు
- యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు
- మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుర్కయంజాల్, తుక్కుగూడ కేంద్రంగా దందా
- అలకనంద ఆస్పత్రి ఉదంతంతో జిల్లా వైద్యశాఖ అప్రమత్తం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, రోగనిర్ధారణ కేంద్రాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు కనీస అనుభవం, అర్హత లేని వారితో చికిత్సలు చేయిస్తున్నాయి. ఆయుర్వేద వైద్యులు అల్లోపతి వైద్యులుగా చలామణి అవుతూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. వనస్థలిపురం, హస్తినాపురం, తుర్కయాంజాల్, మీర్‌పేట్, బాలాపూర్, తుక్కుగూడ, శంషాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, ఆమనగల్లు కేంద్రంగా యథేచ్ఛగా ఈ దందా కొనసాగిస్తున్నాయి. ఇందుకోసం మార్కెటింగ్ ఏజెంట్లను నియమించుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఆర్ఎంపీలకు కమీషన్లు ఆశ చూపి అనైతిక వైద్యానికి పాల్పడుతున్నాయి. 2024 జులైలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి తొమ్మిది పడకల(జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలు) ఆస్పత్రి కోసం అనుమతి పొందిన కొత్తపేట అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఏకంగా కిడ్నీ మార్పిడి చికిత్సలు చేయడం వివాదాస్పదమైంది.

మాస్కులు ధరించి, చికిత్సలు..

జిల్లాలో స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోంలు, సాధారణ క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్స్ కలిపి సుమారు 2,300 వరకు ఉన్నట్లు అంచనా. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి గుర్తింపు పొందినట్లు చెప్పుకొంటున్న మెజార్టీ ఆస్పత్రులకు ఫైర్ సేఫ్టీ లేదు. ఒకరి పేరుతో అనుమతి పొంది.. మరొకరితో చికిత్సలు చేయిస్తున్నారు. బోర్డుపై పేర్లు కనిపించే వైద్యులెవరూ ఇక్కడ అందుబాటులో ఉండటం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఆస్పత్రికి వస్తే కాంపౌండర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులే సీనియర్ వైద్యులుగా చలామణి అవుతున్నారు. రోగులు, వారి బంధువులు గుర్తించకుండా ముఖానికి మాస్కులు ధరించి, సీనియర్ వైద్యుల ప్రిస్క్రిప్షన్‌పై టెస్టులు, మందులు, ఇంజక్షన్లు రాస్తున్నారు. వనస్థలిపురం కాంప్లెక్స్ కేంద్రంగా పని చేస్తున్న ఓ ఆస్పత్రి ఏకంగా డిఫార్మసీ పూర్తి చేసిన ఇద్దరు వ్యక్తులతో పని చేస్తుండటం గమనార్హం. తుక్కుగూడ కేంద్రంగా పని చేస్తున్న ఓ డయాగ్నోస్టిక్ కేంద్రం ఏకంగా కడుపులో ఉన్నది ఆడ బిడ్డా.. మగ శిశువా చెప్పేస్తోంది. ఆర్ఎంపీలు, ఆశ వర్కర్లకు డబ్బుల ఆశచూపి, పెద్ద మొత్తంలో దోచుకోవడంతో పాటు చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారు.

తనిఖీల పేరుతో వసూళ్లు..

పారదర్శకంగా పని చేయాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఆస్పత్రి గుర్తింపు కోసం రూ.లక్షకుపైగా, అదే రెన్యూవల్ కోసం రూ.50 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అడిగినంత ఇస్తేసరి ఫైర్ సేఫ్టీ, భవన నిర్మాణ అనుమతి, డాక్టర్ సర్టిఫికెట్లతో పని లేకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. నిరాకరించిన వాళ్లకు చుక్కలు చూపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తరచూ సర్జరీలు వికటిస్తున్నా.. అనేక రోగులు మృత్యువాతపడుతున్నా.. పట్టించుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లాలోని పలు క్లినిక్‌లలో తనిఖీలు చేశారు. అర్హత లేని వైద్యులను గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఆయా ఆస్పత్రులను సీజ్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా కొత్తపేట అలకనంద ఆస్పత్రి ఘటనతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది.



మంఖాల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అర్హులందరికీ పథకాలు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- మంఖాల్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

తుక్కుగూడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని మంఖాల్ 8వ వార్డులో బుధవారం నిర్వహించిన వార్డు సభకు కలెక్టర్ హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా కోసం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారన్నారు. అర్హుల జాబితాను గ్రామ, వార్డు సభల్లో చదివి వినిపిస్తారని తెలిపారు. సమావేశాలకు రాలేని వారు మండల కేంద్రం, మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిని పరిశీలించిన అనంతరం అర్హులను గుర్తిస్తామని స్పష్టంచేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించి రైతు భరోసా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.హేమలత, కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ బాకీ విలాస్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

షాద్‌నగర్ రూరల్: ప్రజాపాలన గ్రామసభల్లో వస్తున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో బుధవారం నిర్వహించిన పలు సభలను ఆమె పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావీయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదం ధాటికి ఎగిసి పడుతున్న మంటలు



కాలిపోయిన యంత్రాలు

రూ.5 కోట్ల ఆస్తి బుగ్గి పాలు

ఆయిల్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ట్యాంకర్
- భారీగా ఎగిసిపడిన మంటలు
- కార్మికుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం
- ఐదు ఫైరింజన్లతో మంటలను ఆర్పిన సిబ్బంది

షాద్‌నగర్: అన్నారం గ్రామ శివారులోని బీఆర్ఎస్ ఆయిల్ రిఫైనరీ పరిశ్రమలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.5 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఫ్యాక్టరీలోని నూనె శుద్ధి చేసే యంత్రం వద్ద వెల్డింగ్ పనులు చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి, ఆయిల్ ట్యాంకర్‌కు అంటుకోవడంతో పెద్ద శబ్దంతో పేలింది.

విధుల్లో 30 మంది

ప్రమాదం జరిగిన సమయంలో సుమారు 30 మంది ఉన్నారు. వివిధ యూనిట్లలో పని చేస్తున్న పలువురు మంటలను గమనించి.. కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. మిగిలిన వారు సైతం బయటకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఆయిల్ ట్యాంకర్ పేలిన శబ్దం నాలుగు కిలోమీటర్ల దూరం వరకూ వినిపించగా, ఏంజరుగుతుందో తెలియక సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

తీవ్రంగా శ్రమించిన సిబ్బంది

ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు భారీగా ఎగిసి పడుతుండటంతో షాద్‌నగర్, జడ్చర్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్ నుంచి మొత్తం ఐదు ఫైరింజన్లు తెప్పించారు. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి బుధవారం తెల్లవారుజామున 5గంటలకు మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు.

పోలీసుల దర్యాప్తు

అనూహ్య ప్రమాదంతో ట్యాంకర్‌లో నిల్వ ఉంచిన ఆయిల్‌తో పాటు, పరిశ్రమలోని పలు యంత్రాలు కాలిపోయాయి. దీంతో రూ.5 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫ్యాక్టరీ యజమానులు, పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యాన పంటలతో లాభాలు

- కూరగాయలు, పూలు, ఆయిల్‌పాం తోటలపై దృష్టిసారించాలి
- ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్‌బాషా
- వెలిజర్ల, కొండన్నగూడలో పంటల పరిశీలన


షాద్‌నగర్ రూరల్: కూరగాయల సాగుపై దృష్టిసారించాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్‌బాషా రైతులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల, కొండన్నగూడ గ్రామాల్లో సాగు చేస్తున్న కూరగాయలు, ఆయిల్ పాం సాగు, పట్టు పురుగుల రీలింగ్ యూనిట్లను బుధవారం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నగరానికి దగ్గరగా ఉన్న నేపథ్యంలో రవాణా సమస్యలు ఉండవని తెలిపారు. కూరగాయలు, పూలు, ఆయిల్‌పాం సాగుకు అవసరమైన డ్రిప్ పరికరాలు, నారును ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చన్నారు. పూల సాగుతో మంచి లాభాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి సురేశ్, సహాయ ఉద్యాన సంచాలకులు కిషన్‌రావు, పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ లత, అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్ నాగరత్న, ఫీల్డ్ ఆఫీసర్ రుక్మిణి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న యాస్మిన్‌బాషా

లాడ్జిలో మహిళ మృతదేహం

అత్యాచారంగా అనుమానం



శివలీల(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఓ లాడ్జిలో మహిళ మృతదేహం లభ్యమైంది. వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండలం పిట్టలగడ్డతండాకు చెందిన శివలీల(35) భర్త చనిపోవడంతో కన్హాశాంతివనంలో కూలీ పని చేస్తోంది. కర్నూల్‌కు చెందిన దేవదాస్ గతంలో లైన్‌మెన్‌గా పనిచేసేవాడు. అక్కడ ఓ మహిళ హత్య కేసులో జైలుకు వెళ్లడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో కొంతకాలంగా కన్హాలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శివలీల, దేవదాస్‌కు పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ నెల 20న బ్యాంకులో పని ఉందని చెప్పి ఇంటి నుంచి షాద్‌నగర్‌కు వచ్చిన శివలీల దేవదాస్‌తో కలిసి ఉదయం 10గంటలకు పట్టణంలోని సంగమేశ్వర లాడ్జికి వెళ్లింది. బుధవారం గదిలోంచి దుర్వాసన వస్తుండడంతో లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కర్ణాటక టు తెలంగాణ

- నిషేధిత నల్లబెల్లం సరఫరా
- ముఠా గుట్టు రట్టు చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెట్ అధికారులు
- 78.60 క్వింటాళ్ల బెల్లం, డీసీఎం, రెండు ఆటోలు, రూ.1.07లక్షల నగదు సీజ్
- ఆరుగురు ముఠాలో నలుగురి అరెస్ట్

పహాడీషరీఫ్: కర్ణాటక రాష్ట్రం నుంచి రాష్ట్రంలోని పల్లెలకు నిషేధిత నల్లబెల్లం సరఫరా చేస్తున్న ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. ఆరుగురు సభ్యులున్న ఈ ముఠాలోని నలుగురిని బుధవారం రిమాండ్ తరలించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు బాలరాజు, చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం.. శివకాంత్, మహ్మద్‌బాబా, అరుణ్ నాయక్, హీరాసింగ్, నరేశ్, శ్రీను ముఠాగా ఏర్పడి కర్ణాటక రాష్ట్రంలోని బసవతారకం నుంచి నల్లబెల్లం కొనుగోలు చేసి జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీషరీఫ్ ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడ నుంచి నాటుసారా తయారు చేసేందుకు అవసరమైన జిల్లాల వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఓ వ్యాన్‌లో 55.20 క్వింటాళ్ల బెల్లం, రెండు ఆటోల్లో 23.40 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల ఆలంను నల్గొండ జిల్లా నేరేడుగూడ ప్రాంతానికి సరఫరా చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు అక్కడకు చేరుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు బాలరాజు, చంద్రశేఖర్ ఆరుగురిపై కేసు నమోదు చేసి.. నలుగురిని అరెస్ట్ చేశారు. నరేశ్, శ్రీను పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద రూ.15లక్షల విలువ చేసే 78.60 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల ఆలం, ఓ డీసీఎం, రెండు ఆటోలు, రూ.1.07లక్షల నగదును సీజ్ చేశారు. వీటిని సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. ముఠాగుట్టు రట్టు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్

మ్యాన్‌హోల్.. క్లీనింగ్ రోబో

మద్రాస్ ఐఐటీ రూపొందించిన 'హోమ్‌సెప్ సీవర్'



హోమ్‌సెప్ సీవర్ రోబో

- సీఎస్ఆర్ కింద కంటోన్మెంట్‌కు అందజేత
- ప్రారంభించిన బోర్డు అధికారులు
- రాష్ట్రంలోనే ఇది తొలి రోబో.. దీని విలువ రూ.60 లక్షలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఇకపై మ్యాన్‌హోళ్ల క్లీనింగ్‌ను రోబో సాయంతోనే చేయనున్నారు. ఐఐటీ మద్రాస్ సౌజన్యంతో రూపొందించిన 'హోమ్‌సెప్ సీవర్' రోబో ద్వారా మ్యాన్‌హోల్స్ క్లీనింగ్‌కు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఐఐటీ మద్రాస్‌కు చెందిన సోలినాస్ ఇంటెగ్రిటీ ప్రైవేట్ లిమిటెడ్, వెల్స్ ఫార్‌గో సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.60 లక్షల విలువైన ఈ రోబోను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఉచితంగా అందజేశారు. కంటోన్మెంట్ అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్వీ నంజుండేశ్వర.. సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణలతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం సోలినాస్ సంస్థ ప్రతినిధులు ఈ రోబో పని తీరును కంటోన్మెంట్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సూపరింటెండెంట్‌లు రాజ్‌కుమార్, దేవేందర్, మహేందర్, ఇంజినీర్‌లు పి. సావన్ కుమార్, సోలినాస్ సంస్థకు చెందిన నితీష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్‌లు కలిగిన ఏకైక రోబో..

మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మానవ రహితంగా క్లీనింగ్ చేసేందుకు ఈ రోబోలను వినియోగించనున్నారు. సోలినాస్ సంస్థ రూపొందించిన 16 రోబోలు ప్రస్తుతానికి చెన్నై, బెంగళూరు, రాయ్‌చూర్, పాండిచ్చేరి, కేరళలో ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. ఆయా రోబోల కంటే మరింత అధునాతనమైన పూర్తిస్థాయి సెన్సార్‌లతో కూడిన రోబో కంటోన్మెంట్‌కు అందజేయడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రంలో ఈ తరహా రోబో కంటోన్మెంట్‌లో మాత్రమే ఉంది.

ప్రత్యేకతలు ఇవీ..

- వీల్స్, టైర్‌లతో కూడిన ఈ రోబోను సీవరేజీ వాహనాలకు అనుసంధానం చేసి మ్యాన్‌హోల్స్ ఉన్న ప్రాంతాలకు సులభంగా తీసుకెళ్లవచ్చు.
- బ్లేడ్, బకెట్ సక్షన్‌లతో కూడిన ఈ రోబో తానే స్వయంగా మ్యాన్‌హోల్ మూతలను తొలగించి అందులోకి ప్రవేశిస్తుంది.
- క్విక్ బ్లేడ్ బకెట్ సిస్టమ్, రొటేటింగ్ మోటార్‌లు, స్లయిడింగ్ యాక్చువేటర్స్ ద్వారా మ్యాన్‌హోల్ లోపల సులభంగా ప్రయాణిస్తుంది.
- జీపీఎస్ ఎనేబుల్డ్ సిస్టమ్ ద్వారా మ్యాన్‌హోల్ లోపల ఎంత లోతుకు, దూరం వెళ్లింది తెలుసుకోవచ్చు.
- ఈ రోబోలో మొత్తం 4 ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు ఉన్నాయి. ఇందులో మూడు నైట్ విజన్‌తో పనిచేస్తాయి. 170 డిగ్రీల కోణంలో ఫొటోలు, వీడియోలు తీస్తాయి. మరొకటి అండర్ వాటర్ కెమెరా.
- రోబో కెమెరాల్లో నిక్షిప్తం చేసిన ఫొటోలు, వీడియోలను హై రిజెల్యూషన్ కలిగిన డిస్‌ప్లే ద్వారా గమనించవచ్చు. ఆయా కెమెరాల్లో నిక్షిప్తమైన ఫుటేజీని నెల రోజుల వరకు స్టోర్ చేసుకునే వెసులుబాటు ఉంది.
- రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే రోబో మ్యాన్‌హోల్‌లోని చెత్తను సేకరించి, దానికి అనుసంధానం చేసిన స్టోరేజ్ బిన్‌లలోకి మారుస్తుంది.
- ఈ రోబోలో మరో ప్రత్యేకత ఏమిటంటే మ్యాన్‌హోల్ లోపల ఉన్న విషవాయువులను గుర్తిస్తుంది. మిథేన్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్ సల్ఫైడ్, అమోనియా, నైట్రోజన్ డయాక్సైడ్, ఈథెన్ వంటి వాయువుల గుర్తించడంతో పాటు గాఢతను సైతం బయట ఉన్న ఎల్‌సీడీ డిస్‌ప్లేలో చూపిస్తుంది.
- పెట్రోల్‌తో నడిచే ఈ రోబో నిరంతరాయంగా 8 గంటల పాటు పనిచేస్తుంది.



హోమ్‌సెప్ సీవర్ రోబోను ప్రారంభిస్తున్న బోర్డు అధికారులు

గృహిణి అదృశ్యం


మమత చౌదరి (ఫైల్)

హయత్‌నగర్: ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మదన్ చౌదరి, మమతాచౌదరి(32) దంపతులు తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ గ్రామంలో నివసిస్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. భర్త, కొడుకులు సోమవారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఈ క్రమంలో మమతా చౌదరి మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులకు ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మదన్ చౌదరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈత వనానికి నిప్పు


కాలిపోయిన ఈత మొక్కలు

మొయినాబాద్: గుర్తు తెలియని దుండగులు ఈత వనానికి నిప్పంటించారు. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన రేనట్ల మల్లేశ్‌గౌడ్ శ్రీరాంనగర్ రెవెన్యూ సర్వే నంబర్ 239లోని మూడెకరాల భూమిలో 800 ఈత మొక్కలు నాటి పెంచుతున్నాడు. ఇటీవల మల్లేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు తీర్థయాత్రలకు వెళ్లి బుధవారం ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి చూడగా సుమారు 600 ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో వారు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారు. ఈ విషయమై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈత చెట్లు కాలిపోయి నష్టం జరిగిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

దుబాయ్ టోర్నీలో నాగర్‌గూడ విద్యార్థుల సత్తా


ఎయిర్‌పోర్ట్‌లో క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న నాగర్‌గూడ వాసులు

చేవెళ్ల: ఇటీవల దుబాయ్‌లో జరిగిన అండర్–16 క్రికెట్ టోర్నమెంట్‌లో నాగర్‌గూడ యువత సత్తాచాటారు. నియోజకవర్గ పరిధిలోని షాబాద్ మండలం నాగర్‌గూడకు చెందిన సాయి అక్షిత్(9వ తరగతి), సాయి చరిత్(8వ)లు టోర్నీలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లపై విజయం సాధించేందుకు కృషి చేశారు. టోర్నీ ముగియడంతో మంగళవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న జట్టు సభ్యులకు ఘన స్వాగతం పలికారు.

నిరసనలు.. నిలదీతలు

- గందరగోళంగా గ్రామసభలు
- లబ్ధిదారుల జాబితాల్లో అర్హులేరని ప్రశ్నలు
- అనర్హులకే పెద్దపీట వేశారని ఆరోపణలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలు గందరగోళం నడుమ కొనసాగుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డుల ఎంపికకు నిర్వహిస్తున్న ఈ సభలకు జనం పోటెత్తుతున్నారు. వారు ప్రదర్శించిన జాబితాలో తమపేరు లేదంటూ నిలదీస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలకు దిగుతున్నారు.

ఏడాదిలో ఇచ్చిందేముంది?


మంచాల: కాగజ్‌ఘట్‌లో గందరగోళం నడుమ కొనసాగుతున్న గ్రామసభ

మంచాల: అధికారులను, అధికార పార్టీ నాయకులను జనం నిలదీస్తున్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల, కాగజ్ ఘట్, కొర్రవాణి తండా, దాద్‌పల్లి, చిత్తాపూర్, బోడకొండ, రంగాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. అర్హులను గుర్తించడంలోనూ ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని అధికారులపై కాగజ్ ఘట్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో గ్రామసభను అడ్డుకునేందుకు యత్నించారు. కొత్త ప్రభుత్వం పేదోడికి ఏడాది కాలంలో ఏమిచ్చిందని నిలదీశారు. ప్రజల గొంతునొక్కి గ్రామ సభలు నిర్వహించడంతో ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పటికైనా అర్హులని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ఎంవీ.ప్రసాద్, ఎంపీఓ ఉమారాణి, ఏఓ కృష్ణమోహన్, ఏపీఓ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కేడర్‌కే పథకాలా..?


అధికారులను ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు

కుల్కచర్ల: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో బుధవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ వారినే ఎంపిక చేశారని బీఆర్‌ఎస్, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తూ అధికారులను ప్రశ్నించారు. దీంతో గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, ఎంపీడీఓ రామకృష్ణ స్పందించి ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చునని.. అర్హులను గుర్తించి విడతల వారీగా పథకాలు అందిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, జిల్లా నాయకులు స్వామి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్, సోమలింగం, చిన్న పులింగ వెంకటేష్ పాల్గొన్నారు.

పారదర్శకత ప్రశ్నార్థకం!


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం

దోమ: అర్హత ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలని ప్రభుత్వం ఆదేశిస్తే కొందరు అధికారులు మాత్రం అర్హత లేని వారికి కూడా పథకాలు వర్తింపజేస్తున్నారని మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం మండిపడ్డారు. బుధవారం మండల పరిధిలోని మోత్కూరులో నిర్వహించిన గ్రామసభలో అధికారులు పారదర్శకత పాటించడం లేదని ఆరోపించారు. అర్హులకు జాబితాలో చోటివ్వకుండా ఉద్యోగస్తులు, ధనికులు, కాంగ్రెస్ నేతలకు పథకాలు వర్తించేలా యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారే తప్ప ఎక్కడ సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. దరఖాస్తుల పేరిట ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు అర్హులు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు.

సమయం పాటించేదేలే..

ధారూరు: షెడ్యూల్ ప్రకారం బుధవారం ఉదయం 9గంటలకు మండల కేంద్రంలో గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. ఇందుకు అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరైనా.. ప్రత్యేకాధికారి మాత్రం రాలేదు. ఉదయం 10గంటల వరకు ఎదురు చూసిన రైతులు, కూలీలు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. గ్రామ ఇన్‌చార్జిగా ఉన్న మండల ప్రత్యేకాధికారి మల్లేశం కోసం గంటపాటు నిరీక్షించారు. అధికారుల తీరుపై మండిపడుతూ వెనుదిరిగారు. 10.01గంటలకు ప్రత్యేకాధికారి రావడంతో సభను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యేక అధికారి ఎప్పుడు సమయానికి రారు.. గ్రామ సభకుసైతం అదే రూల్ ఫాలో అయ్యారంటూ గ్రామస్తులు వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ కనిపించారు.


ధారూరులో గ్రామ సభలో ఉదయం 9:44 గంటలకు


ఉదయం 10:34 గంటలకు అధికారల రావడంతో నిండుగా కనిపిస్తున్న గ్రామసభ

పవర్ కట్

పంచాయతీ కార్యదర్శి అంజ్యానాయక్ జాబితా చదువుతున్న సమయంలో కరెంట్ పోవడంతో మైక్ మూగబోయింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఆవేశానికి గురయ్యారు. మండల కేంద్రానికి ప్రత్యేక ఫీడర్ ఉందంటూ నిత్యం కోతపెడుతున్నారని.. గ్రామ సభ సమయంలోనైనా విద్యుత్ సరఫరా ఉంచరా అంటూ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిని నిలదీశారు. ఏఈ వెంటనే సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసినప్పటికీ విద్యుత్ సరఫరా ఆలస్యంగా పునరుద్ధరించడంతో కాంగ్రెస్ శ్రేణులు సైతం ఏఈపై మండిపడ్డారు.

'ఇందిరమ్మ ఇళ్లు బంగ్లా ఉన్నవారికేనా?'

గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నా మంజూరవలేదని మండల పరిధిలోని కూరెల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గుడిసె ఉన్నవారికి ఇళ్లు రావు.. బంగ్లా ఉన్నవారికి ఎలా మంజూరయ్యాయని నిలదీశారు. ఎవరికి ఏ పథకం అందకున్నా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని.. తప్పక మంజూరు అవుతుందని పంచాయతీ ప్రత్యేక అధికారి, డీఎస్‌సీడీఓ మల్లేశం పేర్కొన్నారు. నిరసనలు, ఆందోళనల నడుమ దరఖాస్తు చేసుకుని వెళ్లిపోయారు.

పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి

ఐ సడక్ సంస్థ సీఈఓ రోమన్ చేసా

షాద్‌నగర్: పేద విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ఐ సడక్, రాయికల్ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ సంస్థ సీఈఓ రోమన్ చేసా అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐ సడక్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఈఓ రోమన్ చేసా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేద విద్యార్థులు అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. రాయికల్ టోల్‌ప్లాజా సిబ్బంది విశ్వనాథ్‌రాజు, బినయ్ అరోరా, మహ్మద్ ఇబ్రహీం, విజయ్‌బాబు, హెచ్‌ఎం జయమ్మ, మాజీ సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


రాయికల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో ఐ సడక్ సీఈఓ రోమన్ చేసా


విద్యార్థుల మానవహారం

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్: ట్రాఫిక్ నిబంధనలు ప్రతీ ఒక్కరు తప్పక పాటించాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. జాతీయ రహదారి భద్రత మసోత్సవాల సందర్భంగా బుధవారం మొయినాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ చేపట్టి ప్రధాన చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థులు తెలుసుకుని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ప్రమాదాలు నివారించాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్, ప్రధానోపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాజేంద్రనగర్: ప్రేమ పేరుతో నమ్మించి బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితునికి పదేళ్ల జైలుతో పాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. పీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మియాపూర్ ఠాణా పరిధిలోని బాలిక(15) ఇంటర్ చదువుతుంది. ఇదే ప్రాంతానికి చెందిన కార్పెంటర్ పి.రమేశ్ బాలికకు మాయమాటలు చెప్పి 2018 జూన్ 2న విజయవాడకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి బుధవారం నిందితునికి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్

చేవెళ్ల ఎస్‌ఐ సంతోశ్‌రెడ్డి

చేవెళ్ల: నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని చేవెళ్ల ఎస్‌ఐ సంతోశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చేవెళ్ల పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. మండల కేంద్రంలోని రోడ్లపై నంబర్‌ప్లేట్ లేకుండా తిరుగుతున్న 25 బైక్‌లను పట్టుకున్నారు. వారికి చలాన్లు విధించి నంబర్ ప్లేట్ బిగించి వదిలేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డ్రైవ్‌లో ట్రెయినీ ఎస్‌ఐ సాయికృష్ణ, ఏఎస్‌ఐ బుగ్గయ్య, హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య ఉన్నారు.


స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన బైక్‌లు

పథకాలను వినియోగించుకోండి

డీఏఓ నర్సింహారావు


మాట్లాడుతున్న నర్సింహారావు

శంకర్‌పల్లి: ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోకిల తండాలో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు అందిస్తుందని అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేశ్ బాబు, ఎంపీడీఓ వెంకయ్య, సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో పోలీసుల్లో సమష్టితత్వం

- పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది
- రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి
- ముగిసిన రాచకొండ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శివధర్‌రెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందని, క్రీడలు వ్యక్తుల మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణతో పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఆరవ ఎడిషన్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2025 క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన శివధర్‌రెడ్డి మాట్లాడుతూ... పోలీసులు స్వతహా సిద్ధంగా చక్కటి ఫిట్ నెస్ తో క్రీడా సామర్థ్యం కలిగి ఉంటారని, 1956 జాతీయ ఫుట్ బాల్ జట్టులో ముగ్గురు హైదరాబాద్ పోలీసు అధికారులు ఉండటం మనకు గర్వకారణమని ఆయన గుర్తు చేశారు. విధి నిర్వహణలో బిజీగా ఉన్నా వారానికి కనీసం మూడు గంటల పాటు క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ శాంతిభద్రతల నిర్వహణ, నేర నియంత్రణలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని మరింత అంకిత భావంతో పనిచేస్తూ ఆ మంచిపేరును కొనసాగించాలని సూచించారు.

- రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్‌బాబు మాట్లాడుతూ... మూడు రోజులపాటు సాగిన స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న అన్ని జట్లను, విజేతలను అభినందించారు. విధి నిర్వహణలో భాగంగా ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటూ సమర్థవంతంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు మానసికోల్లాసాన్ని అందించే లక్ష్యంతో ఈ రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. రాచకొండ అన్ని జోన్లు, వివిధ పోలీసు విభాగాల నుంచి 25 క్రీడా విభాగాల్లో మొత్తం ఎనిమిది జట్లు, 1000 మంది పోలీసు క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ వంటి పలు రకాల ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. శాంతిభద్రతల నిర్వహణలో సిబ్బందికి నాయకత్వం వహించడంతోపాటు వారి సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్ కుమార్, పద్మజ, అరవింద్ బాబు, సునీతారెడ్డి, రమణారెడ్డి, మురళీధర్, శ్రీనివాస్, ఇందిర, నాగలక్ష్మి, ఉషా విశ్వనాథ్, పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.